# మంచోడి సావు

''వాడు తలమాసినోడైనా సరే!... మొలమాసినోడైనా సరే!... కార్లో తిరిగే కారివేదైనా సరే! ఎవుడో ఒకడు. దోవనబొయ్యే దానయ్య ఒకడట్టా వొచ్చి పిలిస్తేసాలు. ఎనుకూ ముందూ ఊహుఁ! చూసే పనేలే. యాడిదాడ యిడ్సిపెట్టేసి ఒక్క మోపన ఎగబెట్టుకోని పరిగిత్తావే? ఎవుడో మిడిగాళం యదవ. ఉంటాడో ఊడ్సుకోని పోతాడో? బిడ్డ కాలేజీ నుంచి వొస్తావుంటే వాడికేం పొయ్యేగాలం వొచ్చిందో? వాడుగూడా సైకిలు మిందొస్తా డాష్ యిచ్చేసినాడంట. అట్టబొయ్ చూడుబో. ముందిరి సెక్రం మరగతావుండే నూన్లో ముంచెత్తిన అప్పళంమాదిర ముప్పైఆరొంపులు తిరక్క పొయ్యుండాది. తెల్లార్తో లేసి ఆ బిడ్డ కాలేజీకి ఎట్టపోవాల?''

పడ్తా లేస్తా కొంపకొస్తే మాబాశాలి నామింద యిర్సకపడె. నాకా? అరకాలి మంట నసాళానికంటె.

''ఎట్టపోవాలని నన్నడిగితే? రొండుకాళ్లతో నడ్సి. చదివింది చదివినట్టే మర్సిపోతా ఉండ్లా. అట్టా మాదిర్నే ఆ కాలేజీకి దోవగూడా మర్సిపోతే ఆ నాలుగ్గాళ్లమండపం కాడ ఎవుర్నడిగినా చెప్తారు.'' అని మా బాశాలి దండకానికి బ్రేక్ కొడ్తామనిపించె. అయినా తీరుమానంగా అరిగిపొయ్న బ్రేకులు. కొట్నాపడవు. అట్టాంటివి పడేది నాబోటోళ్ల నోర్లకే. అందుకే దేన్కైనా మంచిదని నానోటికే కొట్టుకుణ్నా!

''నిండా మాట్లాడ్తే ఊరంతా గాలించినా ముందిరి సెక్రానికి రిమ్ము దొరక్కుండా బోతే ఎవుడు మాత్రం ఏంచేస్తాడంటా ఒక్క మాట్తో కొట్టిపారేస్తారు. ఈ ఊళ్లో దొరక్కుండా బోతే యింక ఊళ్లే లేవా? ఈణ్ణుంచి సెన్నపట్నానికి ఓడల మింద పోవాల్నా? యిమానా లేమన్నా ఎక్కాల్నా?''

''అడక్కుండా అడిగేదంటే యిట్టా మొగోడా! నేర్చుకో!'' అన్నెట్టు మాబాశాలి నైస్‌గా ఎత్తిపొడ్సె.

''ఆహా! యిన్నేండ్లుగా కతలు రాస్తావుంటే ఈ మాత్రం సెటయిరు చేతికి వొద క్కుండాపోతా ఉండాదే?'' అని ఆలోచించుకుంటా యింక తాచ్చారంచేస్తే మాయింటామె మన దేముళ్ల మాదిర తల్సింది తల్సినట్టుగానే జోరీగ అవతారం ఎత్తినాఎత్తి చెవల్లోనే యిల్లుగట్టుకుంటే? యిప్పుడే చెవులు మద్దిం అంటా ఉండారు. ఆ మిందట ఆ యిబ్బంది పడాల్సిందిగూడా మనమేగదా అనుకోని మదరాసుకు ఎలబార్తా ఉండా.

''అగ్గిపుల్లలు గీసిగీసి సేతులే పడి పూడస్తా ఉండాయి. ఎట్టా పోతా ఉండావు సెన్నపట్నానికి. వొస్తా వొస్తా గ్యాస్‌స్టౌ ఎలిగించుకుండే దానికొక లైటర్ తీసుకోనిరా!''

గోడతట్టుచూస్తా మా యింటామె దండకానికి ముగతాయింపు పలికింది. నాతో చెప్పినా గోడతో చెప్పినా రొండూ వొగిటే అనుకుణ్ణిందేమో? అట్టాంటప్పుడు ఎందుకు చెప్పాల? అంటే చెవల్లో పడ్తే చాలు. చేతులు గట్టుకోని చెయ్యాల్సింది మొగోడి దర్మం. అని అనుకుణ్ణిందో. అది చేసుకుణ్ణె కర్మ అనుకుణ్ణిందో? అదే అర్తంగాలా. అర్తం అయినా కాకుండా పొయ్‌నా మదరాసుకు పొయ్యేది తప్పదు. గ్యాస్ లైటర్ తెచ్చేది తప్పదు!

అందుకే చెన్నపట్నానికి పొయ్యేదానికి ఓడ లెక్కాల్సిన పన్లేదని... అంతకు ముందే యిమానా లెక్కాల్సిన యిబ్బంది లేదని ఎంత గొప్ప సత్తాన్ని ఎంతబాగా యిడమర్సి చెప్పిందబ్బా అనుకుంటా బస్టాండ్‌కు నడ్సినా. ఆడ బస్సెక్కినా!

బస్సులో కూసుంటే కట్టి వొగిటే ఆడ! కలవరం యాడేణ్ణో?

గ్యాస్‌స్టవ్వు ఎలిగించే దానికి అగ్గిపుల్లలు గీసి గీసి మా బాశాలికి చేతులే పడిపూడస్తా ఉండాయంట. అప్పిటికి మాయమ్మ చేతులేమయి పొయ్యుండాలబ్బా?

తల్సుకుంటే యిప్పిటికీ నరెంటికి పడ్తింది.

వరిమడి నాట్నానికో నాటిన మడిలో కలుపు తీసేదానికో లేకుండాపోతే కోతకో కూలోళ్లు కావాలగదా? ఎట్లేదన్నా ఒకపది పద్దెనిమిది మందికి తక్కవ పట్రు. రేపు పొద్దన్నే పననంగానే ఈ పొద్దే పొద్దు గూట్లోపడే యాళకాడ మాయమ్మ ఎగవూరు దిగవూరు లిక్కోళ్లపల్లి ఈ మూడూళ్లు మూడు నిమిశాల్లో సెక్రం తిరిగినట్టు తిరిగేసి కూలోళ్లను పిలిస్తింది. కూలోళ్లు కుదిర్నారంటే? కుదరకుండా యాడ పోతార్లే? పిలస్తా ఉండేదెవురు? గెనిమి మింద నిలబడుకోని పెత్తనం చలాయించే మణిసిగాదే? కూలోళ్లల్లో కూల్దేగదా? కష్టమంటే తెల్సిన మణిసి. కడుపుచూసి కష్టం తెల్సి చూసుకుంటిందని మాయమ్మ కూలికి పిలిస్తే ఒకరూ కాదన్రే?

ఇంక చూసుకో నా తండ్రీ! ఆ రేత్రికి మాయమ్మకు మా అయ్యకు యిద్దరికీ జాగారమే గదా? రొండు తూములు సద్దలు దంచి తూముడు రాగులు యిసిరేదంటే మాట్లా?

గెట్టిగింజలైతే రొండు మానికిలు. అదే పొట్టు గింజలైతే నాలుగు మానికలు కూలిచ్చి మద్దేణంకాడ మణిసికి రొండు ముద్దల సంకటెయ్యాల్నే?

నానబోసిన సద్దలు ఒక వాయి రోట్లోపోసి మా అయ్య రోకలెత్తుకుంటే మాయమ్మ తూముడు రాగులు శాట్లో పోసుకోని రాగలరాతి ముందర కూలబడేది.

సద్దలు పిండిగొట్టి రాగులు, యిసిరేకుందికి చుక్క నడిమిట్టకొచ్చేది.

అప్పుడు పైటకొంగు అట్ట పర్సుకోని మాయమ్మ నడుం వాలిస్తే మాఅయ్య గొడ్లకు కుడితి చూపి గాట్లో కసువంత యిదిలించి ఆ కొట్టాంలోనే మంచం వాల్చుకోని పొణుకుండేవాడు. అంతలోనే యాణ్ణో ఆరక పోతా ఉణ్ణెట్టు తొలికోడి 'కొక్కరోక్కో!' అంటింది. ఆ కూతతో గూడా యిద్దురు ఎగిరిపడి లేస్తారు. మా అయ్య బానామోకు బండీ కదురుగోలు బుజాన పెడ్తే మాయమ్మ ఎద్దులతోలుకోని ఎంటబడేది.

బారడు పొద్దెక్కే కుందికి ఒకరెనకొకరుగా కూలోళ్లు వస్తారు. పన్లోకి వంగతారు. అప్పిటికే మాయమ్మ మాఅయ్య ఒక బాయికింద మడికి తడేస్తారు. ఆ సోబోసోమని వస్తారు. మల్లా కూలోళ్లతో గూడా మునంపట్తారు.

ఆవులేళ అయిందంటే చాలు. మాయమ్మ మునాన్ని యింకొకరికి పట్టిస్తింది. పరుగునడగ్గా యింటికొస్తింది. పొద్దు నడిమిట్ట కెక్కేకుందికి ముప్పైనలబై ముద్దల సంకటి కెలకాల్నే మరి?

పొయ్యిలోకి కట్టెపుల్లలుఎండువయితే పరవాలే. అవ్వి పచ్చిమింద ఉంటేనో లేదు ఈ సీమకు చుట్టచూపుగా వచ్చే నాలుగు చినుకుల్లో తడ్సిపొయ్యుంటేనో అప్పుడుంటింది కత! పొద్దెక్కి పోతా ఉంటింది. పొయ్యి మండకుండా ఉడకాడిపిస్తా ఉంటింది. ఊదన బుర్రెత్తుకోని పుర్రు పుర్రుమని ఊత్తావుంటే... పొయ్యిలో బూడ్డి ఎగిరినట్టే ఎగిరి మల్లా మాయమ్మ తలకాయి మిందనే పడ్తావుంటే అప్పుడు చూడాల ఆ తలకాయిని? బూడ్దిగుమ్మిడికాయి మాదిరుండేది.

''యాళకంత సంకటికెలికి వాళ్ల మొకాన కొట్టకుండా బోతే నాబట్టాగుంపు తలా వొకమాటంటే పడాల్నే? నా కడుపు మంట దీనికెదగ. ఈ పొయ్యిగూడా మండకుండా సతాయిస్తా ఉండాదే? ఏం బతుకో పాడుబతుకు? ఎప్పుడబ్బా ఈ బతుక్కంత నిమ్మతి?... కట్టెల్లో పెట్నెప్పుడేనా?'' అనుకుంటానే ఆ పొగతో పోరకలాడ్తా ఉంటే మోటబానలో నీళ్లు కుమ్మరిల్లినట్టు కండ్లల్లో నీళ్ల కాలవలు గట్తావుంటే మాయమ్మ కాపరం చేసింది.

అగ్గిపుల్లలు గీసిగీసి చేతులు పడిపూడస్తా ఉండాయంటా మా బాశాలీ కాపరం చేస్తా ఉండాది.

మాయమ్మా మణిసే! మా బాశాలీ మణిసే! ఆమె చేసిందీ కాపరమే? ఈపె చేస్తా ఉండేదీ కాపరమే! ఆపె కాపరం అట్టా అగ్గిబడి పొయ్యింది. ఈపె కాపరంలో కూసున్న చోటికి కూరగాయిలు వస్తా ఉండాయి. నిలబణ్ణె చోటికే నీళ్లొస్తా ఉండాయి. ఇట్టతిప్పితే

పొయ్యి మండితింది. అట్టతిప్పితే ఆరిపోతింది. అయినా ఆడనొప్పి యీడనొప్పి అంటా సొణకొట్టతానే ఉంటింది.

మాయమ్మ సుకానికి ఓనమాలు! అదే మా బాశాలి సుకానికి ఆనవాలు! యాడుండాదబ్బా కిటుకు?'' అని ఆలోచించుకుంటా ఉంటే ఒక్కమోపన పోతావుణ్ణె బస్సు ఉణ్ణెట్టుండి నిలబడిపాయ. టకామని నిలబడి పొయ్యిందే? ఎందుకబ్బా! అని అట్టాయిట్టా చూస్తే బస్సులు.. లారీలు... కార్లు... రొండెద్దల బండ్లు వొగిటేమిటి? అన్నీ ఆడ సోలుపుగా నిలబడి పొయ్యుండాయి. ఆ సోలుపు సోలుపు రమారమిగా రొండు మైళ్ళు పొడగనన్నా ఉంటింది. ఉండబట్లేక కిందికి దిగొచ్చి ఆ దోవన పోతావుండే వాణ్ణొకణ్ణి పిల్సి-

''అబ్బారే! ఏమయిందిరా?'' అని అడిగితి.

'ఒరే నీ మొకం బయిశారా? యింకానీకు తెల్దా?'' అన్నెట్టుగా వాడొక చూపు చూసి-

''ఎమ్జీయార్ సచ్చి పొయ్యుండ్లా!'' అని బొరోమని ఏడ్సెసె.

''ఎమ్జీయార్ చచ్చిపోతే యాడవచ్చుగానీ బస్సులెందుకు నిలబెట్టాల?'' అనుకుంటా ఉంటే యింకొకడైతే పైనబడికొట్టబాయ. ఇంకొకడు-

''పిచ్చాటూరుకాడ నిలబెటేసినారు. అట్టపోనీలా. ఇట్టరానీలా. అక్కరగా ఉంటే ఆడికిపాయ్ అడుక్కోపో!'' అనె.

ఆడికి రొండు మైళ్ళు పైబడుండాది పిచ్చాటూరు. పాయ్ అడగాల్నా వద్దా? అని మల్లగుల్లాలు పడ్తా ఉండంగానే గెంట గెడిసిపాయ. బస్సు మల్లా తిరపతికి తిరుక్కోనొచ్చే దానికి ఆడ తిరక్కుండే దానికే రొండు గెంటలు పట్టె!

తిరుక్కోని వస్తావుంటే పుత్తూర్లో వడమాలపేట్లో రేణిగుంటలో యాడచూడు వొగిటే జనం. ఎవుడి నోట్లోయిందామన్నా యిదే మాట!

బస్సు దిగితి. నాలుగ్గాళ్లమండపం కాడికొస్తి. ఆడ చూస్తే రంగు రంగు గుడ్డల్తో పందిలేసినారు. ఆ పందిట్లో నిలువెత్తు ఎమ్జీయార్ పోటాపెట్నారు. సందెడులావు పూలదండ ఆ పోటాకు తగిలించినారు. పొల్లి పొల్లీ ఏడ్సేవాళ్లు యాడస్తా ఉండారు. పాడిపాడీ ఏడ్సే వాళ్లు యాడస్తా ఉండారు. నోరు గొట్టుకుండే వాళ్లేనా? కడుపు గొట్టుకుండే వాళ్లేనా? చీదిచీది యేసే వాళ్లేనా? కాకి సోకంగా ఉండాది. కొందురు మాత్రం ఆ పోటా ముందర నిమ్మళంగా కూసోని బజిన చేస్తా ఉండారు.

ఎవుడి కొంపలో అయినా పీనిగెబడ్తే గూడ యింత ఆలగోడు బాలగోడుగా ఉండదేమో?

పాయ్‌నోళ్లందురు పుణ్ణాత్తులు! అనుకుంటా ఆడ నిలబడుకోనుంటే మణుసు ఎట్టెట్నోపోతా ఉండాది.

మా ఊళ్లో గంగిరెడ్డి నడిపిరెడ్డి అని యిద్దరుండేవాళ్లు. ఇద్దరూ వరసకు నాకు మామలే అవతారు. అయితేగూడా ఒకడు రావణాసురుడైతే యింకొకడు మైరావణుడు. ఒకడు దుశ్శాసనుడైతే యింకొకడు శిశుపాలుడు. ఇద్దరూ యిద్దరే! వాళ్ల మాటంటే ఊళ్లోవాళ్లు ఉచ్చలు పోసుకుండే వాళ్లు. ఒకడు కొంప కూలస్తానని చెప్పి కూలిస్తే యింకొకడు ఎట్ట కూలస్తాడో కూల్నాక గానీ తెల్దు.

పలమనేరు పరసలో ఎద్దల బేరానికని పొయ్‌నోడు గంగిరెడ్డి అట్నే పొయ్‌నాడు. కాకుల గెద్దల పరమైపొయ్‌నాడు. నడిపిరెడ్డి పాణం గురగురమంటా ఉండంగానే సచ్చే నాకొడుకెట్టా సస్తాడు? అని జవురుకొని పొయ్ పారేసొచ్చినారు.

అందుకే మాయమ్మ ''మంచోడిసావు మరణమప్పుడు సూడాల్రా అబ్బోడా'' అంటా ఉండేది. అడే మా అయ్య అయితే–''నలగర్ని మంచిగా పెట్టుకోని బతకమంటారు. ఎందుకో చెప్పరా సూద్దాం?'' అంటా పరీచ్చ పెట్టేవాడు. ఎందుకబ్బా? అని నేను చెప్ప లేకుండా గుటకలు మింగతా వుంటే–

''నలుగురు నాలుగు పక్కల పట్టుకోని మోసేదానికిరా!'' అనేవాడు.

మంచోడి చావంటే యిట్టాంటిదేనేమో అని ఆలోచించుకుంటా ఆడ ఆరుబాటం చూస్తా నిలబడుకొనుంటే ముత్తారెడ్డన్న ఆడికొచ్చె. నన్ను ఎగాదిగా చూసె. నా ఏడుపు మొకాన్ని గెమనించె.''

''ఇదేందిరా అబ్బోడా! రేడియోలో యింటా టీవీలో చూస్తావుంటే వొళ్లట్నే జిలపరిస్తింది. ఉరుబోసుకున్నోళ్లు... కిర్సనాలుపోసి ముట్టించుకున్నోళ్లు... కత్తుల్తో పొడ్సుకున్నోళ్లు... మవుంట్‌రోడ్డు కడుపులో మంట పెట్నోళ్లు. యింటావుంటే అరుసోద్దింగా ఉండాది గదా? అయినా పాపం! ఎర్రిబాగులోళ్లు. ఇట్టాంటోళ్ల కోసరం ఉరికంబాలెక్కి నోళ్లుండారు. ఈళ్లెవురన్నా ఉరేసుకుణ్ణారా? తుపాకి గుండ్లకు గుండె చూపించినోళ్లుండారు. ఈళ్లకు ఎవురికైనా గుండె నిల్సిపొయ్యిందా? ఈళ్ల బతుకుల్ను బతుకులుగ మార్చాలని బతుకుల్నే అడువుల పాల్జేసుకోని అగసాట్లు పడ్తావుండే వాళ్లు పడ్తానే ఉండారు. ఈళ్లెవురన్నా వాళ్ల బతుకుల్ను పట్టించుకుంటా ఉండారా? అనిగదా నీ ఏడుపు. అయినా పాపం వాళ్లకేం తెల్సు? కుడుమిస్తే పండగనే రకం. ఈళ్లిట్నే! వాళ్లట్నే! నువ్వుపదరా!'' అనె.

ఒకప్పుడు కర్ర ఉండే వాడ్తే పెత్తనం. ఇప్పుడు బుర్రుండే వాడ్తే పెత్తనం. బుర్రుండే మొగలాయిలు అది లేనోళ్లమింద పెత్తనం చెలా యిస్తా బెమ్మాండంగా బతికిపోతా ఉండారు. అని అనుకుంటా ఎలబార్నా. అప్పుడు గుర్తుకొచ్చె. సైకిల్ చక్రం రిమ్ముకత. వస్తే ఏంచేసేది? మంచోడి చావేమో మంచి చావే! ఇంటికిపోతే నాచావు నాదే! ●